ఎమ్మెల్యే బాలరాజుకు అత్యధిక మెజార్టీ ఖాయం


మాట్లాడుతున్న పోలవరం నియోజకవర్గ జెడ్పీటీసీలు

కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వరపుత్రుడని, గిరిజనులకు ఆయన దత్త పుత్రుడు అని, వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయనను మంత్రిగా చూడబోతున్నామని పోలవరం నియోజకవర్గ జెడ్పీటీసీలు పేర్కొన్నారు. కొయ్యలగూడెం జెడ్పీటీసీ, జిల్లా విద్యా, వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అడ్రస్ లేని అనామక పత్రికలను అడ్డగా మార్చుకుని తామూ వైఎస్సార్‌సీపీ నాయకులమే అంటూ అసలు పార్టీకి సంబంధం లేని వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని ఖండించారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంతటి మహానేతే బాలరాజు నా మానస పుత్రుడని పేర్కొనగా, సంక్షోభ సమయంలో అండగా నిలిచిన బాలన్న నాకు పెద్దన్నయ్య వంటివాడని స్వయంగా ఉప ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ దఫా కూడా రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ప్రాంతీయ సర్వేల నుంచి జాతీయ సర్వేల వరకు పేర్కొంటున్నాయని అన్నారు. బాలరాజు గత సార్వత్రిక ఎన్నికలలో 42 వేలకు పైగా జిల్లాలోనే అత్యధిక మెజార్టీ రికార్డుతో విజయం సాధించారని, ఈసారి 50వేలకు పైగా మెజార్టీతో ఆయనకు విజయం అందిస్తామని అన్నారు. వచ్చే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఏర్పాటులో పోలవరం నియోజకవర్గానికి మొట్టమొదటిసారిగా మంత్రి పదవి దక్కబోతోందని దానికి బాలరాజు అన్నే అర్హుడని అన్నారు. బుట్టాయిగూడెం మండలం జెడ్పీటీసీ మొడియం రామ తులసి, పోలవరం జెడ్పీటీసీ కలుం హేమాకుమారి, కుక్కునూరు జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, వేలేరుపాడు జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, జీలుగుమిల్లి జెడ్పీటీసీ మల్లం వసంత రావు, కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు సంకుకొండ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనా ఫలితాలు రైతులకు అందాలి


పసుపు ప్రోసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : వ్యవసాయ రంగంలో పరిశోధనా ఫలితాలు రైతులకు అందాలని ఐసీఏఆర్ ఆర్‌ఏసి సీటీఆర్ఐ చైర్మన్ డాక్టర్ గుప్తా అన్నారు. జీలుగుమిల్లి ఐసీఆర్- సీటీఆర్ఐ పరిశోధనా కేంద్రంలో రీసెర్చ్ అడ్వైజరీ కమిటీ గుప్తా నేతృత్వంలో బృందం, సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ ఆధ్వర్యంలో పర్యటించారు. పసుపు ప్రోసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. లోకాస్ట్ పాలీహౌస్, బెల్ ప్రోసెసింగ్ యంత్రం, ట్యాపింగ్ యంత్రం ప్రోట్రేలలో టొబ్బాలజీ, వివిధ రకాల ప్రోగ్రామ్ బేరన్‌లను పరిశీలించారు. కేవీబట్టు, డాక్టర్ కేసీ పాటిల్, డాక్టర్ నారాయణ, సీటీఆర్ఐ ఆర్ఎస్ జీలుగుమిల్లి హెడ్ వైవీ సుబ్బయ్య, డాక్టర్ కస్తూరి కృష్ణ, ఎం. వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం జగన్ కృషి


జంగారెడ్డిగూడెం : జెడ్పీహైస్కూల్‌లో జగనన్న విద్యాకానుకను పంపిణీ చేస్తున్న దృశ్యం


కుక్కునూరు : జగనన్న విద్యాకానుక కిట్లను అందిస్తున్న వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం

జంగారెడ్డిగూడెం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్ల దోపిడీ నుంచి సామాన్యులను రక్షించే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు అందజేయడంతో పాటు, నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. జగనన్న కిట్‌లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, మండలాధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, జిల్లా యూత్ అధ్యక్షులు గిరిబాబు గౌడ్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, ఎంఈవో బి.రాముడు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, బాబి, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ

కుక్కునూరు : జగనన్న విద్యాకానుక కిట్లను గణపవరం ప్రభుత్వ పాఠశాలలో వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, ఉప సర్పంచ్ ఎల్లంకి లక్ష్మణ్‌రావు గురువారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద విద్యార్థులకు మంచి రోజులు వచ్చాయన్నారు. విద్యార్థులు ఏ విషయంలోను ఇబ్బంది పడకూడదన్న తపనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు భారీగా నిధులు కేటాయించారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థులు చదువులలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుర్సం నరేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం ఇప్పించాలని వినతి


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న గోదావరి వరద బాధితులు

కుక్కునూరు : గత జూలై నెలలో గోదావరి వరద కారణంగా ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం వెంటనే బాధితుల ఖాతాలలో జమచేయాలని కోరుతూ గురువారం కుక్కునూరు ఏ బ్లాక్‌కు చెందిన నిర్వాసితులు తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నరసింహారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, గత జూలై నెలలో గోదావరికి వచ్చిన తీవ్ర వరద కారణంగా పలు ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని, మరి కొన్ని ఇళ్లలు కొంతమేరకు దెబ్బతిన్నాయన్నారు. ఈ విషయమై బాధితుల జాబితాను తయారు చేసిన అధికారులు జాబితాలోని కొంతమందికే నష్ట పరిహారాన్ని ఖాతాలలో జమచేశారన్నారు. ఇప్పటికి కూలిపోయిన ఇళ్లను మరలా నిర్మించుకునే స్థోమత లేక ఇంకా పునరావాస కాలనీలలోనే తలదాచుకుంటున్న బాధితులకు నష్టపరిహారాన్ని జమచేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు ఏ బ్లాక్ కు చెందిన నిర్వాసితులు పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల తనిఖీ


లక్కవరంలో తనిఖీలు చేస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు బుచ్చిబాబు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని పేరంపేట, పంగిడిగూడెం, లక్కవరం గ్రామాల్లో ఉన్న విత్తనాల దుకాణాలను గురువారం కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుచ్చిబాబు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో భాగంగా 14 విత్తన నమూనాలను నాణ్యత పరీక్ష కోసం ల్యాబ్‌కి పంపించినట్లు తెలిపారు. వరి విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు అధీకృత డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రైతులు విత్తనం కొనుగోలు చేసిన ట్యాగ్‌ను తప్పనిసరిగా భద్రపర్చుకోవాలన్నారు. అధీకృత పొందిన వరి విత్తనాలను మాత్రమే విక్రయించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని సహాయ వ్యవసాయ సంచాలకులు బుచ్చిబాబు డీలర్లను హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం మండలంలో పీఎల్ఏ 1100 – 832 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 – 20 క్వింటాళ్లు, సంపత్ స్వర్ణ – 18 క్వింటాళ్లు, ఎంటీయూ 1064 – 180 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 – 8 క్వింటాళ్లు, ఎంటీయూ 1318 – 20 క్వింటాళ్లు లభ్యతలో ఉన్నాయని తెలిపారు. మండల వ్యవసాయాధికారి పోశారావు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు సత్కారం


హర్షవర్ధినిని సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న సర్పంచ్ స్వర్ణలత

ద్వారకాతిరుమల: అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కష్టపడి చదవాలని సర్పంచ్ కుంటం స్వర్ణలత విద్యార్థులకు సూచించారు. ఇటీవల విడుదలైన పదవతరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులను గురువారం ఆమె ఘనంగా సత్కరించారు. ముందుగా 556 మార్కులు పొందిన ఏలూరు మండలం తిమ్మారావుగూడెంకు చెందిన బోడిగడ్డ హర్షవర్ధిని, అలాగే 542 మార్కులు పొందిన మొండూరుకు చెందిన భీమడోలు వర్షిణి, 532 మార్కులు పొందిన తిమ్మాపురానికి చెందిన వసంతాటి రమ్యలకు దుశ్శాలువా కప్పి, ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం సర్పంచ్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు ముమ్ముందు ఇదే తరహాలో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాణి, సిబ్బంది ఉన్నారు.

సమాజానికి శ్రీశ్రీ చేసిన సేవలు చిరస్మరణీయం


సీఎస్‌టీఎస్ కళాశాలలో శ్రీశ్రీ సాహిత్య సేవ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీశ్రీ సాహిత్య సేవ సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రసాద్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, తెలుగు అధ్యాపకులు జి.వెంకట్‌లాల్ మాట్లాడారు. శ్రీశ్రీ సమాజానికి చేసిన సేవ, సాహిత్య స్ఫూహను కొనియాడారు. సాహిత్యంలోని అభ్యుదయ కవిత్వం పోకడలను, ప్రపంచ సాహిత్యానికి శ్రీశ్రీ చేసిన కవితా సేవను వివరించారు. కార్మికులు, కర్షకుల కోసం శ్రీశ్రీ కలంపట్టి తన కవితా పంక్తులను, అభ్యుదయ కవిత్వాన్ని వెదజల్లి ప్రజలను చైతన్య పరిచిన విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.నాగేశ్వరరావు, వేంకటాచార్యులు, శ్రీకాంత్, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంట వచ్చే పోలీస్.. దిశ యాప్


దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి వివరిస్తున్న డీఎస్పీ ఎం.ధనుంజయుడు

జంగారెడ్డిగూడెం : వెంట వచ్చే పోలీస్ దిశ యాప్ అని , ప్రతి యువతి, మహిళ వారి సెల్‌ఫోన్‌లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం.ధనుంజయుడు అన్నారు. జంగారెడ్డిగూడెంలో గురువారం దిశ యాప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోలీసు సిబ్బందితో కలిసి మహిళలు, యువతుల సెల్‌ఫోన్‌లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, వినియోగించే విధానాన్ని డీఎస్పీ వివరించారు. జంగారెడ్డిగూడెం సబ్‌డివిజన్ పరిధిలో జంగారెడ్డిగూడెంలో 552, లక్కవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 110, తడికలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 205, చింతలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 300, ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో 200 మహిళలు, యువతులచే దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించినట్లు డీఎస్పీ ధనుంజయుడు తెలిపారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ కొదమ జ్యోతి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. జాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారని తెలిపారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలి


పొంగుటూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

కొయ్యలగూడెం : గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని లేకుంటే దశలవారీ ఉద్యమం చేపడుతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య హెచ్చరించారు. కొయ్యలగూడెం మండలం పొంగుటూరు చర్చి సెంటర్ వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సదస్సును గురువారం నిర్వహించారు. సదస్సు అనంతరం గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను, రైతులు నష్టపోతున్న పంటలను రైతు సంఘం నాయకులు పరిశీలించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరించి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, భూ సేకరణ అధికారులు, హైవే అథారిటీ అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను ఇబ్బందులు గురి చేయడం తగదని అన్నారు. ఆర్బిట్రేషన్ పిటిషన్‌ల జడ్జిమెంట్ ఇవ్వకుండా ఆలస్యం చేయడం అన్యాయమన్నారు. కలెక్టర్ స్పందించి ఆర్బిట్రేషన్ పిటిషన్ల జడ్జిమెంట్ ఇచ్చి ప్రైవేటు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. సర్వీస్ రోడ్లు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు ఆచంట గోపాలకృష్ణ, మార్ని శ్రీనివాస్, మాట్లాడుతూ రోడ్డు పనుల్లో దెబ్బతిన్న చెరకు, మొక్కజొన్న, పొగాకు, వరి తదితర పంటల రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొద్దు రాంబాబు, సీఐటీయూ నాయకులు ఎస్ రాంబాబు, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు గేలం అప్పారావు, పసుపులేటి మోహనరావు, గెడా రమేష్, ముళ్ళపూడి అశోక్, పసల శ్రీనివాసరావు గన్నమని రామకృష్ణ, పాల్గొన్నారు.

అంగన్‌వాడీలలో చిన్నారులకు మానసిక వికాసం


కామవరపుకోట : అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీఎల్‌వీ మంగాదేవి


కుక్కునూరు : ప్రీ స్కూల్ పిల్లలు, తల్లిదండ్రులలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కామవరపుకోట : అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులను చేర్చడం ద్వారా వారికి మానసిక వికాసం పెంపొందుతుందని కామవరపుకోట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీఎల్‌వీ మంగాదేవి అన్నారు. జన్ భగీదారీ కార్యక్రమంలో భాగంగా గురువారం రామన్నపాలెంలో గ్రామస్తులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మంగాదేవి మాట్లాడుతూ మూడేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం ద్వారా బాల్య దశలోనే ఆటపాటలతో పాటు వారు మానసిక అభివృద్ధిని పెంపొందించుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సెక్రటరీ అజయ్, జి.భారతి, ఏఎన్ఎం పద్మ, అంగన్‌వాడీ సిబ్బంది ఎస్.జగదీశ్వరి, బి.నాగమణి పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: అంగన్‌వాడీ విద్య.. ఆటపాటల విద్య అని జీఎంఎస్‌కే సూపర్‌వైజర్ మేరి అన్నారు. గుండుగొలనుకుంట సెక్టారులో జన్ భగీదారీ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రీస్కూల్ అభివృద్ధికి, అలాగే పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల, భాషా, సాంఘికాభివృద్ధి, గణితాభివృద్ధి, సంసిద్ధత వంటి ఆరు అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కునూరు : ఐసీడీఎస్ అమరవరం సెక్టార్, కిష్టారం సెక్టార్‌ల ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపేట, నల్లకుంట గ్రామాల్లో జన్‌భగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్లు వీఎస్ రుక్మిణి, కె.మయూరీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో మూడు నుంచి ఆరేళ్ల వయసు గల పిల్లలకు అందించే సమగ్రాభివృద్ధి అంశాల గురించి, ఎసెస్‌మెంట్ కార్డుల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లంకి లక్ష్మణ్‌రావు, పేట ఈశ్వరయ్య, ఆశ వర్కర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్ జానకి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఆటపాటలతో కూడిన విద్య అంగన్‌వాడీ కేంద్రంలో సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా అన్నారు. గురువారం జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయంలో జన్‌భగీదారి కార్యక్రమం నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. కాగా గురువారం తల్లులతో అక్షరాలు, అంకెల రూపంలో రంగోళి నిర్వహించినట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు కె.లక్ష్మి, మంగతాయారు, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం


విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి తెలంగాణా రాష్ట్రం ఖమ్మంకు చెందిన శ్రీనాథరాజు విజయ భాస్కర రాజు గురువారం రూ. 3,65,000 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ ఏఈఓ కేఎల్ఎన్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ద్వారకాతిరుమల తహసీల్దార్‌గా సతీష్


శ్రీవారిని దర్శించుకున్న నూతన తహసీల్దార్ సతీష్

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండల నూతన తహసీల్దార్‌గా పొట్టూరి సతీష్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌లోని జి సెక్షన్ (ఎస్‌డబ్ల్యూఎల్‌ఏ)లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతి పొంది, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన చినవెంకన్నను, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

హ్యాండ్ సర్జన్ భాస్కరానంద్‌కు సత్కారం


భాస్కరానంద్‌కు వేద ఆశీర్వచనం అందజేత

ద్వారకాతిరుమల : స్థానిక విర్డ్ ఆసుపత్రిలో అంతర్జాతీయ ప్రఖ్యాత హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కరానంద్‌ను ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు, వైద్యులు గురువారం ఘనంగా సత్కరించారు. వైద్య రంగంలో భాస్కరానంద్ అందిస్తున్న సేవలను, ఆయన ఖ్యాతిని చాటుతూ ఇటీవల సింగపూర్‌లో ఏషియన్ పసిఫిక్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ వారు 'ఫర్ సర్జరీ ఆఫ్ ద హ్యాండ్' అనే బుక్ ను రూపొందించారు. దాన్ని సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శి చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ క్రమంలో విర్డ్ ఆసుపత్రికి విచ్చేసిన డాక్టర్ భాస్కరానంద్‌ను ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకర్, డాక్టర్ భవ్యచంద్, శ్రీవారి దేవస్థానం ఏఈఓ పి.నటరాజరావు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ఘనంగా సత్కరించారు. పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని అందజేశారు.

బెదిరింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళను బెదిరించిన నేరంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం చింతాకుల భవానీ వివాహమై, భర్త నుంచి విడాకులు తీసుకుని తల్లి వద్ద ఉంటూ జీవనాధారం కోసం స్థానిక రెస్టారెంట్‌లో పనిచేస్తోంది. ఈ క్రమంలో కొండేటి శ్రీను అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. ఈ నెల 14న వివాహం విషయమై శ్రీను ఇంటికి వెళ్లి ప్రశ్నించగా ఆమెపై దురుసుగా ప్రవర్తించి, చంపేస్తానని బెదిరించాడు. దీనికి మరో ఇద్దరు సహకరించారని, తనకు, తన కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని భవానీ ఫిర్యాదులో పేర్కొందన్నారు.

అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : తన భార్య, ఇద్దరు పిల్లలు కనిపించడం లేదని మండలంలోని తాడువాయి ఆంధ్రాషుగర్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పి.విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 14న ఉదయం 10 గంటల సమయంలో విజయ్‌కుమార్ భార్య దుర్గ, తన కుమారులు వినయ్ ప్రసాద్(7), యవరాజ్ (3) కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు చేశారు. ఆ రోజు తన భార్య, ఇద్దరు పిల్లలతో ఆంధ్రాషుగర్స్ కర్మాగారం కాలనీ నుంచి రోడ్డుపైకి వచ్చి ఒక ఆటోలో జంగారెడ్డిగూడెం వైపు వెళ్లినట్లు తెలిసిందన్నారు. తన భార్య, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వంట చేస్తుండగా..

జంగారెడ్డిగూడెం రూరల్: నాగులగూడెం పంచాయతీ పైడిపాక నిర్వాసిత కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో వంట చేస్తుండగా గ్యాస్ పైపు లీకై మంటలు చెలరేగాయి. దీంతో వంట చేస్తున్న వంట మనిషి సరస్వతి కాలికి గాయమైంది. ఆమెకు స్థానిక వైద్యులచే చికిత్స అందించారు. వంట సామాన్లకు మంటలు వ్యాపించడంతో కొంత మేర నష్టం సంభవించింది.

వృద్ధులను కాపాడాలి

చింతలపూడి : వృద్ధుల సంక్షేమంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కృష్ణజ్యోతిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సీహెచ్ మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్‌లో వృద్ధుల కోసం వృద్ధ మిత్ర లేక వయోమిత్ర హెడ్ కానిస్టేబుల్‌ను నియమించాలని కోరారు. గ్రామ, వార్డు వలంటీర్లు తమ పరిధిలో వృద్ధులపై జరుగుతున్న వేధింపులను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు


నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : విద్యుత్ అవసరాలు పెరిగిన నేపథ్యంలో నాణ్యమైన విద్యుత్‌ను అందించే క్రమంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో గురువారం స్థానిక 27వ వార్డు ఎస్ఎస్ నగర్, భారత్‌గ్యాస్ గోడౌన్ రోడ్, పేరంపేట రోడ్డులోని గణపతి టౌన్‌షిప్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు విద్యుత్ శాఖాధికారులు నిర్వహించారు. 27వ వార్డులో 15 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, గణపతి టౌన్‌షిప్‌లో 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

యువకుడికి గాయాలు

కుక్కునూరు : ఆటోను వెనక నుంచి బైక్‌తో ఢీకొట్టిన ఘటనలో మండలంలోని పెద్దరావిగూడెం గ్రామానికి చెందిన వేముల సందీప్(26) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం, సందీప్ గురువారం ఉదయం పెద్దరావిగూడెం నుంచి బూర్గంపాడు వెళ్తున్న క్రమంలో వెంకటాపురం గ్రామం వద్ద ముందుగా వెళ్తున్న ఆటోను వెనకనుంచి బైక్‌తో వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడడంతో సందీప్‌కు రెండు కాళ్లు విరిగాయి. వెన్నుముఖ భాగంలో, చేతులకు గాయాలయ్యాయి.క్షతగాత్రుడ్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భద్రాచలం అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

పోలవరం రూరల్ : కాకినాడ జిల్లా రౌద్రపూడి మండలానికి చెందిన ఎంపీపీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన విజయలక్ష్మిపై దాడిని ఏలూరు జిల్లా ఎంపీపీ సంఘం అధ్యక్షులు సుంకర వెంకట రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఒక ఎంపీపీగా ఉంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చైర్మన్ అయిన మహిళను ప్రోటోకాల్ పాటించకుండా ఆసుపత్రి ప్రారంభించడానికి ఆహ్వానించకపోగా, ప్రశ్నించిన ఎంపీపీ విజయలక్ష్మిపై దాడికి పాల్పడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ

టి.నరసాపురం : బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కిన్నెరసాని బ్రిడ్జ్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలను బాలరాజు గురువారం ఫోన్‌లో పరామర్శించారు. మృతుడు జట్ల దుర్గారావు తండ్రి కనకారావును, పచ్చిపాల చిన శ్రీనివాసరావు తండ్రి సుబ్బారావులను, సమీప బంధువు, మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ దాసరి రాంబాబులను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ఆసరాగా ఉంటామని ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఆయా కుటుంబాలకు ఆయన సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఎమ్మెల్యే స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో పరామర్శించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కిన్నెరసాని బ్రిడ్జివద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన జట్ల దుర్గారావు, వారిద్దరి కుమారులు పచ్చిపాల చిన శ్రీనివాసరావులకు గురువారం తిరుమలదేవిపేటలో అంత్యక్రియలు నిర్వహించారు.